క్లుప్తంగా

సామూహిక వ్రతాలు



మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు స్వామి వారికి పూర్ణాహుతి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు శివరామ్‌ప్రసాద్, నరసింహ స్వామి భక్తులచే సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, ఆంజనేయులు, వెంకటేష్, కృష్ణయ్య, రాములమ్మలు పాల్గొన్నారు.

దాతకు సన్మానం



దామరగిద్ద: ఆలయాలకు తన వంతు సహకారాన్ని అందిస్తున్న దాత వన్నాడ వెంకటప్ప సేవలు అభినందనీయమని యాదవ సంఘం నాయకులు అన్నారు. మల్లయ్య గుడి నిర్మాణానికి అందించిన సహకారానికి కృతజ్ఞతగా శాలువ పూలమాలతో సత్కరించారు. గ్రామానికి చెందిన త్రోబాల్ క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో తన వంతుగా రూ.25 వేల ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించారు. సర్పంచ్ ఆశమ్మ, వన్నడ చంద్రకాంత్, నారాయణ, అనంతరెడ్డి, మాణిక్యప్ప, ఆయా ఆలయాల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష



కోస్గి: పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించి సోమవారం పోలీస్, రెవిన్యూ శాఖ అధికారులు ఆలయ కమిటీ, దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. వాహనాల పార్కింగ్, పోలీస్ చెక్ పాయింట్‌ల ఏర్పాటు, భక్తులకు కల్పిస్తున్న వసతులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. దుద్యాల తహసీల్దార్ భీమయ్య, కోస్గి సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులు, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్, బుగ్గప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



మరికల్: వచ్చే ఎన్నికలలో బీజేపీ పార్టీ అధికారంలో వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ ఇన్‌చార్జ్ నర్సన్‌గౌడ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లప్ప, శివకుమార్, ఉదయభాను, రఘు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాంచంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

బస్‌డిపో సమస్యలు పరిష్కరించాలి

కోస్గి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కోస్గిలో బస్‌డిపో సమస్యలను పరిష్కరించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్‌డిపోలో అధికారికంగా 39 బస్సులు ఉండాల్సి ఉండగా కేవలం 11 బస్సులతోనే డిపోను కొనసాగిస్తున్నారన్నారు. కుమ్మరి అంజిలయ్య, అచ్యుతారెడ్డి, అంబదాస్, అమృత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోరాటాల ఫలితమే వేతనాల పెంపు



మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ జీఓ నంబర్ 8 ను విడుదల చేసిందని పోరాటాల ఫలితంగానే అది సాధ్యమయిందని జిల్లా ఇఫ్టూ అధ్యక్షుడు కిరణ్ అన్నారు. సోమవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 న మక్తల్‌లో తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా జనరల్ సమావేశం ఉంటుందని, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన ఎక్లాస్‌పూర్ జాతర



అన్నదానం ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్



ప్రత్యేక అలంకరణలో స్వామి

నారాయణపేట రూరల్ : మండలంలోని ఎక్లాస్‌పూర్ కొండలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఆదివారం అర్ధరాత్రి స్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల కోలాహలం మధ్య రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి ప్రసాద వితరణ చేపట్టారు. కోనేటిలో చిన్నారులు కేరింతలు కొట్టగా, యువకులు రెట్టాపట్లలో మునిగిపోయారు. మహిళలు, యువతులు జాతరలో అలంకార వస్తువుల కొనుగోలు చేశారు. కోటకొండ పీహెచ్‌సీ వైద్య బృందం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసాయం చేశారు. గుట్టకింద భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి మడితో నైవేద్యం తయారు చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు. పలువురు భక్తులు ఉచితంగా అన్నదానం, మంచినీరు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అయితే రెండు గ్రామాలకు చెందిన యువకులు చెరుకులతో కొట్టుకుని గొడవ పడ్డారు. సరైన పార్కింగ్ వ్యవస్థ లేక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

స్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

కలెక్టర్ మయాంక్ మిట్టల్ జాతరకు హాజరై స్వామిని దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డి, దళితమోర్చా అధ్యక్షులు అశోక్, బీఆర్ఎస్ నాయకులు గందె చంద్రకాంత్, విజయ్‌సాగర్, సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ జమున, ఎంపీటీసీ రాంరెడ్డి, ఎఫ్ఏ వెంకటేష్, మధుసూధన్‌రెడ్డి, ఎంపీడీఓ రాజులు స్వామి వారికి పూజలు చేశారు. ఏఓ, గ్రామ పెద్దలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



క్రీడాకారులతో కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్ : నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను సోమవారం కలెక్టర్ శ్రీహర్ష అభినందించారు. ఈ నెల 10నుంచి మూడు రోజుల పాటు బిహార్ రాష్ట్రం పట్నాలో అథ్లెటిక్స్ మీట్ జరుగుతుందని, జాతీయ స్థాయిలో జిల్లా పేరును నిలబెడతామని ఆ సంఘం కార్యదర్శి రమణ కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో రాకేష్, మధు, రమేష్, సిద్దిక్, లక్ష్మి పాల్గొన్నారు.

కోటకొండను మండలంగా ఏర్పాటు చేయాలి

నారాయణపేట రూరల్ : అత్యధిక జీపీలు కల్గిన నారాయణపేటను విభజించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండ గ్రామాన్ని వెంటనే మండల కేంద్రంగా మార్పు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు సోమవారం కలెక్టర్ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వాపోయారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు, పార్టీ కార్యాలయాలకు భవనాలు సైతం ఉన్నాయని, వ్యాపార రీత్యా చుట్టు పక్కల 15 గ్రామాల ప్రజలు కోటకొండకు వచ్చి వెళ్తుంటారని చెప్పారు. కాశీనాథ్, సలీం, నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపు పెంచాలి

నారాయణపేట టౌన్ : ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్ 2023–2024 ఆర్థిక సంవత్సరం నిధుల కేటాయింపును పెంచాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీం, ప్రశాంత్ అన్నారు. ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందించారు. జిల్లా నాయకులు చెన్నాప్ప, కనుకరాయుడు, సాయిలు నరసింహులు, నారాయణ, అశోక్, ఉషప్ప, కతలప్ప, కూలీలు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీ చెక్కులపై ఫిర్యాదు

కోస్గి: తమ బిడ్డలకు పెళ్లిళ్లు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికి కల్యాణ లక్ష్మీ చెక్కులు అందడం లేదని సోమవారం హన్మాన్‌పల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీజేపీ కోడంగల్ అసెంబ్లీ కో కన్వీనర్ కోటకొండ రాము ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కొత్త మండలాల ఏర్పాటు నేపథ్యంలో ఏ మండలంలో తమ గ్రామానికి సంబంధించిన వివరాలు నమోదు కాకపోవడంతో చెక్కులు అందడం లేదని ఆధారాలతో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందిరమ్మ, అంజిలమ్మ, వెంకటమ్మ, మొగులమ్మ, సత్యమ్మ ఉన్నారు.

వాహనం ఢీ : జింక మృతి

మక్తల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందిన ఘటన సోమవారం మక్తల్ పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. విషయంపై సమాచారం అందడంతో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జింకకు పోస్టుమార్టం చేయించారు. సమీపంలో గుంతను తవ్వి పూడ్చి వేశారు.

నేటి నుంచి జాతర

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ వీధిలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారికి విశేష పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట: జిల్లా తెలంగాణ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జడ్పీ సీఈఓ జ్యోతి, ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రధాన కార్యదర్శి వై.గోపాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్



నారాయణపేట రూరల్ : ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, డీఈఓ లియాకత్‌అలీలు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని, పిల్లలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రహమాన్, ఖవాజా కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



మద్దూరు: సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకల పోస్టరును సోమవారం తహసీల్దార్ రవి, గిరిజన ఐక్యవేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా పాటించాలని నాయకులు తహసీల్దార్ వినతి పత్రం అందజేశారు. మేఘనాథ్, లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, బంద్యనాయక్ శ్రీను, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ టీయూడబ్ల్యూజే హెచ్–143 మహాసభ మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు రాజశేఖర్, రఘు, అంజయ్య, షబ్బీర్, షఫీ, నారాయణరెడ్డి, విజయ్, శ్రీనివాస్‌గౌడ్, బస్వరాజ్, పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, వేణుగోపాల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండారోత్సవాలు



మరికల్‌లో బండారు చల్లుకుంటున్న భక్తులు



మక్తల్‌లో చిన్నారికి పట్టం కడుతున్న పూజారి

మక్తల్: పట్టణంలో సోమవారం బీరప్ప ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కుర్వకులస్తులు బండారు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో మక్తల్ సీఐ సీతయ్య, ఎస్ఐ పర్వతాలు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ దేవరి మల్లప్ప, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ కొండయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో బీరప్ప బండారోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. బీరప్ప ఆలయం ఆవరణలో పూజలు చేసిన అనంతరం దండు కురువ కులస్తులు బండారు(పసుపు) చల్లుకున్నారు. బంధువులు తెచ్చిన నూతన దుస్తులు ధరించి బీరప్పస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు, బంధువులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కొనసాగుతున్న ‘కంటివెలుగు’

మక్తల్: సామాన్‌పల్లి గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్నవారికి అవసరమైన మందులు, అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ వెంకటన్న, కంటి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం

మద్దూరు: ఇంటింటికీ జోడో యాత్ర సందేశం కార్యక్రమాన్ని సోమవారం జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా, సంజీవ్‌కుమార్ రహీం, సుభాష్, మల్లీఖార్జున్, బాబుస్వామి, కిష్టప్ప, హుసేన్, భీములు ప్రారంభించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో యాత్ర ప్రారంభిస్తున్న తరుణంలో సందేశ యాత్రను చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



పాథర్చేడ్‌లో మెటీరియల్స్‌ను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

నర్వ: ప్రభుత్వ బడుల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు తాము అందిస్తున్న స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్వ, పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు.విద్యార్థులు మెటీరియల్ వినియోగించుని మంచి ఫలితాలు సాధించాలని, గ్రామాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు చెన్నయ్య, గోవిందు, రమాదేవి, రఘు, ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మెన్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామంలో శివ భక్తులు సోమవారం ఘనంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కలశ ఊరేగింపు చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు, గ్రామస్తులకు అన్నదానం చేశారు.

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో శివపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు. మండలంతో పాటు, వివిధ గ్రామాల శివభక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీకళ

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎంపీపీ శ్రీకళ అన్నారు. మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామంలో సోమవారం సీసీరోడ్డు పనులను పరిశీలించారు. గత ప్రభుత్వాల కారణంగా ఒకప్పుడు పల్లెలు అభివృద్ధి చెందక దయనీయ పరిస్థితులలో ఉండేవన్నారు. ప్రస్తుతం పరిస్థితి మారుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోదమ్మ, సర్పంచ్ సుజాత, రవి, మతిన్, తిరుపతయ్య, పాపిరెడ్డి, వెంకటస్వామి, శివయ్య, నర్సిములు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్వార్ ఉర్సు



ముస్తాబైన అన్వార్ దర్గా

నారాయణపేట టౌన్ : తెలంగాణ రాష్ట్ర సరిహద్దున కర్ణాటకలోని యాదగిరి జిల్లా అన్వార్ గ్రామంలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయని, రాత్రి పది గంటలకు గంధోత్సవం ఉంటుందని నిర్వాహకులు మజర్ హుస్సేన్ ఖాద్రి, మహమ్మద్ ఖాజమైనోద్దీన్ ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. దర్గా ముతవల్లి మహమ్మద్ మున్నవర్ హుస్సేన్ ఖాద్రి మాట్లాడుతూ గురువారం ఉదయం జరాత్ దీపారాధన, చిరాగా ఉంటాయని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనికోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

మాగనూర్: అమ్మపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు సోమవారం ముగిసాయి. కొత్తపల్లి జట్టు మొదటి బహుమతిని గెలుచుకుంది. సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్, ఉపసర్పంచ్ పద్మమ్మ, గ్రామపెద్దలు నర్సిములు, మైపాల్‌రెడ్డి, కృష్ణ, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’



నర్వలో యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

మాగనూర్: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికి తిరిగి బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అరాచక పాలన చేస్తున్నాయని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం యాత్రకు సంబంధించిన స్టిక్కర్లను విడుదల చేశారు. నాయకులు నర్సింహ, లక్ష్మప్ప, లోకపల్లి నర్సములు, ఆనంద్‌రాజు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

నర్వ: హాత్‌సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం కార్యక్రమాన్ని నర్వలో ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జోడోయాత్ర ఉద్దేశ్యాలు, అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు టీవీఎస్ చెన్నయ్యసాగర్, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, నాయకులు శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆటో అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

శరణలింగ మహారాజ్ ఆశయాలను నెరవేర్చాలి



మహా మంగళహారతి ఇస్తున్న స్వామిజీ

నర్వ: శంకర శరణలింగ మహారాజ్ ఆశయాలను నెరవేర్చాలని నేరెడ్‌గోమ్ పీఠాధిపతి పంచమసిద్ధ లింగ స్వామి అన్నారు. సోమవారం రాంపురం మఠంలో నిర్వహించిన జాతర మహోత్సవాల సందర్భంగా రెండో రోజు జరిగిన గిరిజా కల్యాణం కార్యక్రమంలో స్వామిజీ పాల్గొన్నారు. మహా మంగళ హారతి నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఎద్దుల బండలాగుడు పోటీలు కొనసాగాయి. అర్చకులు బసవలింగ స్వామి, నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, నర్సిములుగౌడ్, గోవిందురెడ్డి, లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనువాసులుశెట్టి, భగవంతాచారి, కిష్టప్ప పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివభక్తుల పాదయాత్ర



ఊట్కూర్ నుంచి పాదయాత్రగా వెళ్తున్న మాలాధారులు

కోస్గి: పట్టణంలోని శ్రీమంజునాథ ఆశ్రమానికి చెందిన శివమాలధారులు సోమవారం శ్రీశైలానికి పాదయాత్రతో బయలు దేరారు. అంతకుముందు గురు స్వాముల ఆధ్వర్యంలో స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమానికి చెందిన 30 మంది శివమాలాధారులు, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: గ్రామానికి చెందిన 90 శివమాలాధారులు సోమవారం ఇడుముడి కట్టుకొని శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. అంతకు ముందు స్థానిక వీరభద్రేశ్వర దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఇడుముడి కార్యక్రమం చేపట్టారు. నరసింహులు, భీంరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

మాగనూర్: సీపీఎస్ సమస్య పరిష్కరించే బాధ్యత పీఆర్‌టీయూ టీఎస్ తీసుకుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి వై జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కస్తూర్బా , వడ్వాట్, నెరడగం, మాగనూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్నకేశవరెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు నరేందర్, మండల ప్రధానకార్యదర్శి తిమ్మన్న, బాల్‌రాం, నర్సింములు, నర్సింహారెడ్డి, వెంకటయ్య, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

మద్దూరు: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం పీఆర్‌టీయూ అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం బలపరిచ్చిన గుర్రం చెన్నకేశవరెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. సోమవారం మద్దూరు మండలంలోని కేజీబీవీ, పెదిరిపాడ్, మోమినాపూర్, రెనివట్ల, ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు నరేష్, రాజేందర్, సవిత పాల్గొన్నారు.

భాషాపండితులకు న్యాయం చేయాలి

నారాయణపేట రూరల్ : ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పండిట్, పీఈటీలకు న్యాయం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో అనేకసార్లు ఊరించి మోసం చేశారని, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా ఫలితం దక్కలేదని వాపోయారు. ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. కోర్టు తీర్పుకు లోబడి పండిట్, పీఈటీలకు పదోన్నతుల అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి నర్సింహా పాల్గొన్నారు.